సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



తెల్లారేసరికి బూడిదే మిగిలింది!
షార్ట్ సర్క్యూట్‌తో ఓ బట్టల షాపులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షాపు పూర్తిగా దగ్ధమై తెల్లారేసరికి బూడిదే మిగిలింది. - 8లో▸



చదువు.. క్రీడలు..
ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కేయూ కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు కృష్ణవేణి కాంస్య పతకం సాధించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
33.2^{0} / 25.3^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



చిట్యాల: విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గోల్కొండ భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, నాయకులు చిలుకల రాయకోంరు, గంగాధరి రవీందర్, అల్లం రాజు పాల్గొన్నారు.

సర్క్యులర్ జారీ చేయాలి




భూపాలపల్లి రూరల్: స్ట్రక్చర్ మీటింగ్‌లో జరిగిన ఒప్పందాలపై సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీచేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. భూపాలపల్లిలోని కొమురయ్య భవన్‌లో సోమవారం సంఘం సమావేశం రాంచందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల సంక్షేమం, ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ నిరంతరం పాటుపడుతుందన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం బాగా పెరిగి పోయిందన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు శ్రీనివాస్, విజేందర్, ఆసిఫ్ పాషా, సుధాకర్ రెడ్డి, తోట రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

‘గ్రామాల అభివృద్ధే లక్ష్యం’



చిట్యాల: గ్రామాల అభివృద్ధే బీజేపీ లక్ష్యమని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలుసాని తిరుపతిరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తిరుపతిరావు హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను బడుగు బలహీన వర్గాలకు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, జిల్లా, మండల నాయకులు చెక్క నర్సయ్య, వెంకటవీరు, శ్రీనివాస్, స్వామి, సంపత్, వంశీ, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్యూలైన్‌లో దర్శనానికి వస్తున్న భక్తులు



కాళేశ్వరాలయంలో శ్రావణ శోభ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో శ్రావణశోభ నెలకొంది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ముందుగా త్రివేణి సంగమ గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి గర్భగుడిలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. శ్రీశుభానందదేవి, శ్రీసరస్వతి అమ్మవార్ల దేవాలయంలో మహిళలు పూజలు నిర్వహించారు. సాయంత్రం గర్భగుడిలో భక్తులు లక్షపత్రి పూజలను ప్రత్యేక పూజా కార్యక్రమాలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణలో ఆలయం మారుమోగింది. దీంతో భక్తులు సందడి కనిపించింది.



లక్షపత్రి పూజలు చేస్తున్న భక్తులు

స్వచ్ఛతలో వెనుకబాటు

మూలనపడిన చెత్త సేకరణ వాహనాలు

ర్యాంకుల్లో వెనుకబాటు..
కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మూడేళ్లుగా పట్టణాలకు ర్యాంకులను ప్రకటిస్తుంది. గత నెలలో ప్రకటించిన ర్యాంకుల్లో భూపాలపల్లి పట్టణం రాష్ట్రంలో 135, జాతీయస్థాయిలో 732వ స్థానాన్ని దక్కించుకుంది. ఇంటింటా చెత్త సేకరణ, సెగ్రిగేషన్, ప్రాసెసింగ్, పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణ సక్రమంగా లేకపోవడం, తడి, పొడి చెత్త వేరు చేయకపోవడం వలన భూపాలపల్లి వెనుకబాటులో ఉన్నట్లు వెల్లడైంది.

మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో తుప్పు పట్టిపోతున్న ట్రాక్టర్లు



- డోర్ టు డోర్ కలెక్షన్‌లో నిర్లక్ష్యం
- సరిపడా లేని పారిశుద్ధ్య కార్మికులు
- సమస్యలపై దృష్టి సారించని మున్సిపాలిటీ అధికారులు
- ‘స్వచ్ఛ సర్వేక్షణ్’లో రాష్ట్రంలో 135వ ర్యాంకు

మున్సిపాలిటీ సాధించిన ర్యాంకులు ఇలా..

సంవత్సరం	రాష్ట్రస్థాయి ర్యాంకు	జాతీయస్థాయి ర్యాంకు
2022–2023	21	920
2023–2024	88	1,169
2024–2025	135	732





మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మూలన పడి ఉన్న చెత్త సేకరణ ట్రాలీలు

భూపాలపల్లి: భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. చెత్త సేకరణ వాహనాలు మూలన పడటం, ఇళ్ల నుంచి చెత్త సేకరణలో నిర్లక్ష్యం ప్రదర్శించడం, వార్డులకు సరిపడా కార్మికులు లేకపోవడంతో నిత్యం పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ఫలితంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల సాధనలో జాతీయ, రాష్ట్రస్థాయిలో భూపాలపల్లి వెనుకంజలో ఉంది.

సగం వాహనాలు మూలకే..
పట్టణంలో 30 వార్డులు ఉండగా సింగరేణి సంస్థ 7, మున్సిపాలిటీ 23 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతుంది. చెత్త సేకరణ, తరలింపు కోసం మున్సిపాలిటీలో 12 స్వచ్ఛ ఆటోలు ఉండగా.. అందులో నాలుగు మరమ్మతుకు నోచుకోని ఆటోలు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మూలన పడి ఉన్నాయి. మరొకటి షోరూంలో ఇవ్వగా బిల్లు చెల్లించని కారణంగా బయటకు రావడం లేదు. మిగిలిన ఏడింటితోనే 23 వార్డుల్లో చెత్త సేకరించాల్సి వస్తుంది. మూడు ట్రాక్టర్లు, ఒక బ్లేడ్ ట్రాక్టర్ ఉండగా మరమ్మతుకు నోచుకొని ఆరు నెలలు కావొస్తుంది. ఫలితంగా ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడమే కాక వీధుల్లో చెత్త పేరుకుపోతుంది. బస్టాండ్, మార్కెట్, ప్రధాన కూడళ్లలో ఎప్పుడు చూసినా పారిశుద్ధ్య లోపం దర్శనమిస్తుంది. మురుగు కాలువల్లో నుంచి తొలగించిన చెత్తను రోడ్డు పక్కన పడేసి రోజులు గడుస్తున్నా తొలగించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

పారిశుద్ధ్య కార్మికులు ఇతర పనులకు..
పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేకపోవడమే కాక కొంతమందికి ఇతర పనులు కేటాయించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మున్సిపాలిటీలో 154 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండగా 67 మంది మాత్రమే శానిటేషన్ విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన 87 మంది డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్, అటెండర్లుగా పనిచేస్తున్నారు. నలుగురు జవాన్లు మాత్రమే ఉండగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో జూనియర్ అసిస్టెంట్ శానిటరీ విభాగాన్ని చూస్తున్నాడు.

అటకెక్కిన బయో మైనింగ్..
పట్టణంలో ప్రతీరోజు సేకరిస్తున్న చెత్త 21 టన్నుల వరకు వస్తుంది. డంపింగ్ యార్డుల్లో ఇప్పటివరకు సుమారు ఆరు వేల టన్నుల చెత్త పేరుకుపోయి ఉంది. ఆ చెత్తను బయో మైనింగ్ విధానం ద్వారా శుద్ధి చేసి, మళ్లీ ఉపయోగించేందుకు అవసరమైన ముడి సరుకును వేరుచేస్తారు. ఈ విధానంలో వచ్చిన మట్టి, రాళ్లు, ప్లాస్టిక్, ఇనుమును మున్సిపాలిటీ ఆధ్వర్యంలో విక్రయిస్తారు. ఈ విధానం కాగితాలకే పరిమితం అయింది. బయో మైనింగ్ విధానం కోసం కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.6లక్షలు మాత్రమే మంజూరు చేసింది. తూకం వేసేందుకు వేబ్రిడ్జి నిర్మాణం, బయోమైనింగ్ యంత్రాల కొనుగోలుకు ఆ నిధులు సరిపోవడం లేదు. దీంతో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు పనులు ప్రారంభించడం లేదు.

ప్రతిపాదనలు పంపాం..



చెత్త సేకరణ వాహనాల మరమ్మతుల అనుమతి కోసం మున్సిపాలిటీ ప్రత్యేక అధికారికి ప్రతిపాదనలు పంపాం. అనుమతి రాగానే వాహనాలను బాగు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. ప్రస్తుతం ఉన్న వాహనాలతో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. సమస్య తలెత్తకుండా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం చేపడుతున్నాం.

– బిర్రు శ్రీనివాస్, భూపాలపల్లి మున్సిపాలిటీ కమిషనర్

సమష్టి కృషితోనే జిల్లాకు అవార్డు



ప్రజావాణిలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: సమష్టి కృషితోనే సంపూర్ణత అభియాన్‌లో రాష్ట్ర స్థాయిలో అవార్డు సాధించామని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. అవార్డు సాధించిన సందర్భంగా ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కలిసి కలెక్టర్‌కు శాలువా కప్పి మెమెంటో అందజేసి సత్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ కింద మహాముత్తారం, పలిమెల మండలాలను యాస్పిరేషన్ బ్లాకులుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా మండలాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ, పోషణ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధనతో జిల్లాకు అవార్డు లభించిందని తెలిపారు. ఇది మన జిల్లాకు లభించిన గొప్ప గౌరవమని, ఇదే స్ఫూర్తితో సేవల్లో ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

వేడుకలకు ఏర్పాట్లు చేయాలి..
స్వాతంత్ర్య వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి అతిథి ప్రసంగించనున్న ప్రసంగ పాఠం తయారు చేయాలని డీపీఆర్ఓ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఇందుకు గాను అన్ని శాఖల అధికారులు 5వ తేదీ వరకు ప్రగతి నివేదికలు ఇవ్వాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి..
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 90మంది నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

రేగొండ: జిల్లాలో ఎరువుల కొరత లేదని కలెక్టర్ రాహుల్‌శర్మ స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని పీఏసీఎస్‌కు చెందిన ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, ఎరువుల నిల్వలు, స్టాక్ బోర్డు, రశీదు పుస్తకాలను పరిశీలించారు. రైతులు తమ అవసరాల మేరకే ఎరువులు తీసుకోవాలని తెలిపారు. ఎరువుల సరఫరాలో పారదర్శకతను పాటించాలని, దుకాణాల వద్ద స్టాక్ బోర్డులను ప్రతీ రోజు అప్‌డేట్ చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఎరువుల సరఫరాలో అక్రమాలను సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్వేత ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజల విశ్వాసం పొందేలా పనిచేయాలి

ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి: విధి నిర్వహణలో ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివస్ కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 21మంది నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల సమస్యలు విన్న వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగినప్పుడే పోలీసుల పట్ల గౌరవం, నమ్మకం కలుగుతుందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

పురుగుల అన్నం తినలేకపోతున్నాం..

- కొర్కిశాల కేజీబీవీ విద్యార్థుల మొర..
- పాఠశాల సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం

మొగుళ్లపల్లి: ‘పురుగుల అన్నం తినలేకపోతున్నాం.. కుళ్లిన పండ్లు ఇస్తున్నారు.. భోజనంలో రాళ్లు, తెల్ల పురుగులు, దోమలు, ఈగలు, వెంట్రుకలు బోళ్లను శుభ్రపరిచే స్టీల్ ముక్కలు వస్తున్నాయి.. ప్రిన్సిపాల్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదు..’ మీరైనా పట్టించుకోండి సార్ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కొర్కిశాల కేజీబీవీ విద్యార్థుల మొర పెట్టుకున్నారు. సోమవారం కేజీబీవీలో 27 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా.. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి కేజీబీవీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎమ్మెల్యే ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. ఉదయం ఫుడ్ పాయిజన్ అయిన వెంటనే ఉన్నతాధికారులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని కేజీబీవీ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. వంట సిబ్బందిని, బియ్యం నిల్వలను వెంటనే మార్చాలని ఆదేశించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర

పలువురి పరామర్శ
విద్యార్థినులను బీఆర్‌ఎస్ నాయకులు జోరుక సదయ్య, కొడారి రమేష్, బలుగురి తిరుపతి రావు పరామర్శించారు. మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనచారి ఫోన్‌లో విద్యార్థినులతో మాట్లాడి పరామర్శించారు.

అంటువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

- రానున్న రెండు నెలలు అత్యంత కీలకం
- రాష్ట్ర ఎయిడ్స్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి/కాళేశ్వరం/రేగొండ: అంటువ్యాధుల నియంత్రణలో రానున్న రెండు నెలలు అత్యంత కీలకమని, వైద్య ఆరోగ్య శాఖ పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎయిడ్స్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్, ఉమ్మడి వరంగల్ జిల్లా సీజనల్ వ్యాధుల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, మహదేవపూర్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, ఐసీటీసీ కేంద్రాలు, రేగొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్త నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరకు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇంటింటా జ్వర సర్వేలు నిర్వహించి పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు సరైన అవగాహన కల్పించడంతో పాటు వైద్య ఆరోగ్యశాఖ సమస్త సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, రోగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఉప సంచాలకులు నాగరాజు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇన్‌చార్జ్ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీదేవి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాదేవి, మహదేవపూర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ విద్యావతి, ఆర్ఎంఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాటారం మండలం బొప్పారంలో డెంగీ సోకి కోలుకున్న బాలికతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

ఎమ్మెల్యేల మధ్య ఇసుక దుమారం!

- రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్సెస్ గండ్ర సత్యనారాయణ
- భూపాలపల్లి వాగుల ఇసుక పరకాలకు వెళ్లకుండా ఎమ్మెల్యే ఆంక్షలు?
- పరకాల ఎమ్మెల్యే అడిగినా ససేమిరా అంటున్న గండ్ర
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ‘పొంగులేటి’ వద్దకు చేరిన పంచాయితీ

సాక్షిప్రతినిధి, వరంగల్/పరకాల: అధికార పార్టీకి చెందిన పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు నడుమ ఇసుక సరఫరా విషయంలో మాటల యుద్ధం జరిగిందా..? పరకాల నియోజకవర్గానికి భూపాలపల్లి నియోజకవర్గంలోని వాగులనుంచి ఇసుక తరలింపు నిలిచిపోయిందా? ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఉచిత ఇసుక సరఫరా విషయంలో మొదలైన ఈ పంచాయితీ పార్టీ కార్యకర్తల వరకు పాకిందా?.. అంటే నిజమే అంటున్నారు కాంగ్రెస్ పార్టీ కేడర్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు. కొద్ది రోజులుగా భూపాలపల్లి నియోజకవర్గంలోని వాగులనుంచి పరకాల నియోజకవర్గానికి ఇసుక తరలకుండా రెవెన్యూ, పోలీసుశాఖల అధికారులు గస్తీ కాయడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య ఇసుక రవాణాపై సంభాషణ జరిగినా ఫలితం లేకపోవడంతో చివరకు ఈ పంచాయితీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి వద్దకు వెళ్లిందన్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.



భూపాలపల్లి ఇసుక.. పరకాలకు తరలకుండా ఆంక్షలు..
అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంతింటి కలనెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వమే ఉచితంగా ఇసుక తరలింపునకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సమీప ప్రాంతాల్లో ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడి నుంచి సరఫరా చేయాలని సూచించింది. భూపాలపల్లి నియోజకవర్గంలోని ఏ ఒక్క వాగునుంచి ఇసుక ట్రాక్టర్ పరకాలకు తరలివెళ్లకుండా రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు కట్టడి చేస్తున్నారు. మండలాల సరిహద్దుల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్ల సిబ్బంది రాత్రివేళలో మఫ్టీలో సంచరిస్తూ ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటున్నారని పరకాల వాసులు చెబుతున్నారు. కేసులు పెట్టడానికి కూడా వెనుకడుగు వేయకపోవడంతో, దీంతో పరకాలకు ఇసుక తరలింపు నిలిచిపోయిందని అంటున్నారు. ఇదేంటని అడిగితే పోలీసు, రెవెన్యూ అధికారులు పరకాలకు ఇసుక వెళ్తే చర్యలు తీసుకోవాలంటూ భూపాలపల్లి ఎమ్మెల్యేనుంచి ఆదేశాలున్నాయని చెబుతున్నారని పరకాల కాంగ్రెస్ నేతలు అంటున్నారు. దీంతో చిట్యాల మండలంలోని టేకుమట్ల, కాల్వపల్లి, కలకోటపల్లి, మొగుళ్లపల్లి మండలంలోని నవాబుపేట, ఇస్సిపేట, కొర్కిశాల, రేగొండ మండలంలోని కనపర్తి వాగుల నుంచి ఇసుక తరలించకుండా ఆంక్షలు విధించినట్లు సమాచారం.

ఆకాశాన్నంటిన ఇసుక ధర..
గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక క్వారీలు 15 ఉండగా, వర్షాల కారణంగా అందులో 14 క్వారీలు నీట మునిగాయి. మిగతా ఒక్కటి అడవి సోమన్నపల్లి నుంచి మాత్రమే ఇసుకను తరలిస్తున్నారు. గతంలో ఒక్కో టన్నుకు రూ.800 నుంచి రూ.1000 ఉండగా ప్రస్తుతం మూడు రెట్లు అంటే రూ.2,500 వరకు నడుస్తుంది. అంటే ఒక్కో లారీ 32 టన్నులు అంటే రూ.80వేలు అవుతుంది. అంత ధర సామాన్యుడు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో పొరుగు జిల్లానుంచి, వాగుల నుంచి ఇసుక తరలించుకోవడంపై ఆంక్షలు విధించడం పరకాల నియోజకవర్గంలోని తమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జ్ మంత్రి వద్దకు ఇసుక పంచాయితీ
భూపాలపల్లి, పరకాల ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య నెలకొన్న ఇసుక పంచాయితీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరకు వెళ్లినట్లు తెలిసింది. భూపాలపల్లి నుంచి ఇసుక రాకుండా ఆంక్షలు విధించడంపై మొదట ఎమ్మెల్యే సత్యనారాయణరావుతో మాట్లాడిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి.. ఫలితం లేకపోవడంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

మోటార్లు ఆన్ చేయాల్సిందే!

- ‘చలో కన్నెపల్లి’కి బీఆర్‌ఎస్‌పార్టీ బృందం
- పోలీసులతో వాగ్వాదం.. తోపులాట

కాళేశ్వరం: రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సందర్భంగా బీఆర్‌ఎస్ బృందం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో సోమవారం ‘చలో కన్నెపల్లి’ మోటార్లు ఆన్ చేయాల్సిందేననే డిమాండ్‌తో పర్యటించారు. ముందుగా పలువురు కాళేశ్వరాలయంలో పూజలు చేశారు. అనంతరం పంపుహౌస్ అప్రోచ్ కెనాల్ వద్ద వరదను పరిశీలించారు. మండలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపలి(లక్ష్మీ)పంపుహౌస్ మోటార్లు ఆన్‌చేసేందుకు పంపుహౌస్ 2వ గేటు నుంచి పంపుల వద్దకు వెళ్లడానికి బీఆర్‌ఎస్ బృందం సభ్యులు 300 మందితో తరలి వచ్చారు. గేటు గుండా ముట్టడించిన బీఆర్‌ఎస్ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో కాసేపు తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. గేటు ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తరవాత ఇరిగేషన్ ఈఎన్‌సీ హెడ్ అమ్జద్ హుస్సేన్‌తో మాట్లాడారు. అనంతరం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి కుట్రలకు రైతులు బలైపోతున్నారన్నారు. కన్నెపల్లి వద్ద 93.7 మీటర్లు ఉంటేనే పంపులు ఆన్ చేసుకోవచ్చు, ప్రస్తుతం 97.60 మీటర్ల నీళ్లున్నా పంపులు ఆన్ చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని పేర్కొన్నారు. లక్షా 40 వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతుందని, ప్రతి రోజు 10 టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తుందన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి కన్నెపల్లి పంపు హౌజ్ ఆన్ చేయడానికి వచ్చిన ఇబ్బంది ఏంటో తెలియడం లేదన్నారు. ప్రస్తుతం లక్షా 42 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతుందన్నారు. మిడ్ మానేరులో 20 టీఎంసీలకు 7 టీఎంసీలు, ఎల్ఎండీలో 20 టీఎంసీలకు 7 టీఎంసీలే ఉన్నాయని తెలిపారు. ఎల్లంపల్లిలో 20 టీఎంసీలకు 8 టీఎంసీలే ఉన్నాయని పేర్కొన్నారు. కాళేశ్వరంతో నీళ్లు ఇవ్వకుండా అన్ని జిల్లాలను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, విద్యాసాగర్‌రావు, దాసరి మనోహర్ రెడ్డి, సుంకే రవిశంకర్, రసమయి బాలకిషన్, దివాకర్‌రావు, చల్మెడ లక్ష్మీ నరసింహారావు, దావా వసంత, జక్కు శ్రీహర్షిణి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అప్రోచ్ కెనాల్ వద్ద మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

క్లుప్తంగా

21న వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు


వాల్యా నాయక్, ఎన్నికల అధికారి

రామన్నపేట : వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ నూతన పాలకవర్గ ఎన్నికకు ఈనెల 21న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎలక్షన్ ఆఫీసర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహకార అధికారి ఎం. వాల్యా నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 8,11, 12 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 13న పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా, గుర్తుల కేటాయింపు, 21న పోలింగ్, పోలింగ్ అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని వివరించారు. ఫలితాల ప్రకటన తర్వాత మూడు రోజుల్లో ఆఫీస్ బేరర్స్ ఎన్నికల ఉంటాయని పేర్కొన్నారు. బ్యాంక్ పాలకవర్గంలో మొత్తం 12 మంది సభ్యులకు గాను ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి ఒక స్థానం, మహిళా కేటగిరీకి రెండు స్థానాలు, ఓపెన్ కేటగిరీకి 9 స్థానాలు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ కార్యక్రమం ఓ సిటీ రోడ్డులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో, పోలింగ్, ఓట్ల లెక్కింపు ఏవీవీ కళాశాలలో జరుగుతుందని వివరించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

అదుపు తప్పిన బైక్..

ఫర్టిలైజర్ నిర్వాహకుడి దుర్మరణం


సాంబశివరావు (ఫైల్)

హసన్‌పర్తి: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామారం సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన సాంబశివరావు (46) స్థానికంగా లక్ష్మీ పేరుతో ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం శనిగరంనుంచి హనుమకొండ వైపునకు బయల్దేరాడు. రామారం వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సాంబశివరావు అక్కడకక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కాకతీయ యూనివర్సిటీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎం మార్చురీలో భద్రపరిచిన సాంబశివరావు మృతదేహాన్ని ఫర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సాంబశివరావు కుటుంబానికి తమ అసోసియేషన్ అండగా ఉంటుందని సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న తెలిపారు. నివాళులర్పించిన వారిలో లెక్కల పున్నం చందర్‌రెడ్డి ఉన్నారు.

చదువు.. క్రీడలు..

ఏషియన్ పారా తైక్వాండో పోటీల్లో రీసెర్చ్ స్కాలర్ కృష్ణవేణి ప్రతిభ

- అభినందించిన వీసీ, రిజిస్ట్రార్


కృష్ణవేణిని సన్మానిస్తున్న వీసీ కె.ప్రతాప్, రిజిస్ట్రార్, రామచంద్రం, ప్రొఫెసర్లు


కాంస్య పతకం సాధించిన మాచర్ల కృష్ణవేణి

కేయూ క్యాంపస్: మలేషియాలో గత నెల30, 31తేదీల్లో నిర్వహించిన ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకురాలు మాచర్ల కృష్ణవేణి కాంస్య పతకం సాధించారు. భారతదేశం తరఫున పాల్గొన్న ఆమె ఇండియన్ పారా తైక్వాండో ప్రెసిడెంట్ వీణ చేతుల మీదుగా పతకం అందుకున్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌కు చెందిన ఎల్లగౌడ్ - హైమావతి దంపతుల కుమార్తె కృష్ణవేణి. తండ్రి ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. కృష్ణవేణి హనుమకొండ సుబేదారిలోని దివ్యాంగుల హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. తైక్వాండో పోటీలకు ఆన్‌లైన్‌లోనే ఈ.గణేష్ కోచింగ్ ఇస్తుండగా, జనగామలోని తైక్వాండో కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

ఆర్థిక సహకారంతో ఏషియన్ పోటీలకు..

మలేషియాలో ఏషియన్ పారా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు మాచర్ల కృష్ణవేణికి ఆర్థికపరమైన సమస్య ఏర్పడగా కాకతీయ యూనివర్సిటీ నుంచి అధికారులు రూ.25వేలు అందజేశారు. కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికాలోని ప్రవాస భారతీయులు, ఆ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎస్.శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ గిరిగౌడ్, డాక్టర్ అతికం శ్రీనివాస్‌గౌడ్ కలిపి రూ.1.40లక్షలు అందించారు. దాతల ఆర్థికసాయంతో ఏషియన్ పారా తైక్వాండో పోటీల్లో భారతదేశం తరఫున పాల్గొని ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించిన కృష్ణవేణికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

అంతర్జాతీయ, జాతీయస్థాయి పోటీల్లోనూ..

గతేడాది 2024లో కాంబోడియాలో నిర్వహించిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లోనూ బంగారు పతకం సాధించారు. అలాగే, గత మార్చిలో ఫస్ట్ ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్ షిప్‌లో కాంస్యపతకం సాధించారు. చిన్నప్పటినుంచి చదువుతోపాటు వివిధ క్రీడాపోటీల్లో పాల్గొంటున్న కృష్ణవేణి పారా సిట్టింగ్ వాల్‌బాల్‌లోనూ ప్రతిభ చూపుతున్నారు. 2021లో కర్ణాటక ఉడిపిలో జరిగిన జాతీయస్థాయి సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో, 2024 మార్చిలో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో, తమిళనాడు ఈరోడ్‌లో జరిగిన సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లోనూ ప్రతిభ చూపారు.

కృష్ణవేణి కామర్స్‌విభాగంలో పరిశోధకురాలు..

కాకతీయ యూనివర్సిటీలోనే కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పీజీ కోర్సు చేశాక మూడేళ్లుగా ఇదే విభాగంలో పరిశోధకురాలుగా పీహెచ్‌డీ చేస్తున్నారు. 'ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టివ్ ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఇండియా ఏ స్టడీ' అనే అంశంపై ఆ విభాగం ప్రొఫెసర్ నర్సింహాచారి పర్యవేక్షణలో పరిశోధన సాగిస్తున్నారు.

అభినందించిన వీసీ, రిజిస్ట్రార్

క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణిని సోమవారం యూనివర్సిటీలో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం శాలువా కప్పి సన్మానించారు. జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణవేణి క్రీడల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తూ విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా నిలుస్తున్నారన్నారు. ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.అమరవేణి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వై.వెంకయ్య, దివ్యాంగుల సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు, తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ అనంతలోకాలకు..

- బోల్తా పడిన ట్రావెల్స్ బస్సు.. ఒకరి మృతి
- 13 మందికి తీవ్ర గాయాలు
- నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఘటన


మంగీలాల్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్/శాలిగౌరారం : శ్రీశైలం మల్లికార్జునస్వామి వారి దైవదర్శనానికి వెళ్లొస్తూ ఓ వ్యక్తి అనంతలోకాలకు చేరాడు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన 365వ నంబర్ జాతీయ రహదారిపై నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామం వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాబునాయక్ తండా, వినాయక తండా, పత్తిపాక ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, శాలిగౌరారం ఎస్సై సైదులు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయకతండా, బాబు నాయక్ తండా, పత్తి పాక ప్రాంతాలకు చెందిన 14 మంది తాపీ మేస్త్రీలు ఆదివారం ఉదయం ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శ్రీశైలం మల్లికార్జునస్వామివారి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం వీరు తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. డ్రైవర్ గుండెపాక నవీన్ అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ 365వ నంబర్ జాతీయ రహదారిపై శాలిగౌరారం మండలం మాధారంకలాన్ గ్రామం వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్టాడు. దీంతో ట్రావెల్స్ బస్సు రహదారి పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న బానోత్ మంగీలాల్(42) తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. బానోత్ రమేశ్, బానోత్ లాలు, భూక్య సర్వం, అంబోతు శ్రీను, గుగులోత్ నరేశ్, భూక్య వీరన్‌కు తీవ్రగాయాలు కాగా.. మరో ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలిసిన వెంటనే వారి కుటుంబీకులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను నల్లగొండ, నకిరేకల్, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన లచ్చిరాం, నరేశ్ మహబూబాబాద్‌కు తరలించి ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్సై సైదులు తెలిపారు.

పెళ్లి ఇంట్లో చోరీ..

బయ్యారం: పెళ్లి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో దుండగులు 5 తులాల బంగారం, 600 గ్రాముల వెండి, రూ. లక్ష నగదు అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి గ్రామానికి చెందిన అనగం రాధాకృష్ణ శనివారం తన కుమార్తె వివాహం మిర్యాలగూడలో జరగగా కుటుంబీకులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. తిరిగి సోమవారం ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. దీంతో అనుమానం వచ్చి బీరువాలో భద్రపరిచిన బంగారం, వెండి, నగదు చూడగా కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తెల్లారేసరికి బూడిదే మిగిలింది!


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న బట్టల షాపు


దగ్ధమైన కరెన్సీ


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- బట్టల షాపులో అగ్నిప్రమాదం
- రూ. 50 లక్షల మేర ఆస్తి నష్టం
- అగ్ని ప్రమాదానికి కారణం పాము..
- కన్నీరుమున్నీరవుతున్న బాధితులు

టేకుమట్ల: షార్ట్ సర్క్యూట్‌తో ఓ బట్టల షాపులో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో షాపు పూర్తిగా దగ్ధమై తెల్లారేసరికి బూడిదే మిగిలింది. దీంతో చేసేదేమీలేక బాధితులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్లలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాస్ 2012లో టేకుమట్ల మండల కేంద్రంలో బట్టల షాపును ప్రారంభించి ఇక్కడే స్థిరపడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి 11 గంటలకు విద్యుత్ స్తంభంపైకి పాము ఎక్కడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించి షాపులో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన యజమాని శ్రీనివాస్ విద్యుత్ నిలిపి మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. కానీ అప్పటికే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. దీంతో చేసేదేమీ లేక చుట్టుపక్కల వాళ్లను పిలిచి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. షాపు షెట్టర్ రాకపోవడంతో జేసీబీతో తొలగించారు. అలాగే, వెంటనే ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులు వచ్చేసరికే షాపు మొత్తం కాలి బూడిదైంది.

మిగిలింది బూడిదే..

మండల కేంద్రంలో అర్ధరాత్రి మారుతి బట్టల షాపులో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో ఏ ఒక్క వస్తువు మిగులకుండా పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ. 20 లక్షల నగదుతోపాటు షాపులో ఉన్న సుమారు రూ.30 లక్షల విలువైన స్టాక్ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. వాటితోపాటు ఫర్నిచర్, కౌంటర్ ఏ ఒక్క వస్తువు కూడా మిగలకుండా కాలి బూడిదైంది. షాపు పైఅంతస్తులో ఉన్న కుటుంబ సభ్యులు ప్రమాద సమయంలో వెంటనే కిందికి రావడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ అగ్ని ప్రమాదంలో బూడిదే మిగిలిందని పొట్ట చేత పట్టుకుని మండల కేంద్రానికి వలస వచ్చిన శ్రీనివాస్‌తోపాటు కుటుంబీకులు కన్నీరుమున్నీరవుతున్నారు.

ఎమ్మెల్యే గండ్ర పరామర్శ..

షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన మండల కేంద్రంలోని మారుతి బట్టల షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సోమవారం పరిశీలించారు. అనంతరం బాధితులను పరామర్శించి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానన్నారు.

ఎగసిపడిన మంటలతో ఏం చేయలేకపోయాం..

షార్ట్ సర్క్యూట్ సంభవించిన కొన్ని నిమిషాల్లోనే షాపులో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. మోటారు పైపు సాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. కళ్లముందే ఎగసిపడే మంటల్లో షాపు దగ్ధమవుతుంటే గుండెలు పగిలాయి. ఎంత ప్రయత్నించినా ఏం చేయలేకపోయా. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి షాపు పూర్తిగా దగ్ధమైనది. ఇప్పుడు నాకు మిగిలింది బూడిదే.

– శ్రీనివాస్, మారుతి బట్టల షాపు యజమాని

ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

అండర్-16 బాలికల విజేత హనుమకొండ

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు


లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారిణి


హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు


షాట్‌పుట్ వేస్తున్న క్రీడాకారిణి


హ్యామర్‌త్రో విసురుతున్న క్రీడాకారుడు

వరంగల్ స్పోర్ట్స్: అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ అథ్లెటిక్స్ అసోయేషన్ల ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. అండర్-14, 16, 18, 20 బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీల్లో 33 జిల్లాల నుంచి 1,400 మంది అథ్లెట్లు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు..

ఆయా జిల్లాల అథ్లెట్ల మధ్య హోరాహోరీగా సాగిన వివిధ పోటీల్లో ఖమ్మం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. అండర్-18 బాలుర కేటగిరీలో మహబూబ్‌నగర్, బాలికల అండర్-18 విభాగంలో ఖమ్మం, అండర్-16 బాలుర విభాగంలో రంగారెడ్డి, అండర్-16 బాలికల విభాగంలో హనుమకొండ జిల్లా విజేతలుగా నిలిచాయి. ముగింపు వేడుకలకు ఆర్యవైశ్య సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు చాంపియన్‌షిప్ కోసం పోటీలో పాల్గొన్న ప్రతీ అథ్లెట్ విజేతే అన్నారు. పతకం సాధించలేదని ఆందోళన చెందకుండా, మరోసారి బరిలోకి దిగి లక్ష్యం సాధించాలన్నారు.


అతిథుల చేతుల మీదుగా ఓవరాల్ చాంపియన్ ట్రోఫీ అందుకుంటున్న ఖమ్మం క్రీడాకారులు


అతిథుల చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న హనుమకొండ క్రీడాకారులు

దేవాదుల వద్ద నాలుగు మోటార్లు పంపింగ్ నిలిపివేత

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం జీపీ పరిధిలోని గుట్టలగంగారం వద్ద గోదావరిపై ఉన్న జె. చొక్కారావు ఎత్తిపోతల వద్ద ఎనిమిది మోటార్లతో కొనసాగిన పంపింగ్‌లో సోమవారం ఫేజ్ త్రీలో నాలుగు మోటార్లను ఆఫ్ చేశారు. ఆదివారం వరకు పంపింగ్ వద్ద మూడు ఫేజ్‌లలో ఉన్న పదింటిలో ఎనిమిది మోటార్లతో కొనసాగించిన అధికారులు.. సోమవారం నాలుగు మోటార్లను ఆఫ్ చేసి ఫేజ్-1లో రెండు, ఫేజ్-2లో రెండు మోట్లారతో పంపింగ్ కొనసాగిస్తూ దిగువకు 8,48 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 75.80 మీటర్ల నీటిమట్టం కొనసాగుతోందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్ రూరల్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ డీఎస్పీ ఎస్.తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. టౌన్ ఎస్సై కె.శివ సిబ్బందితో కలిసి నర్సంపేట బైపాస్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో పోలీసులు అతడిని ఆపగా, పారిపోయేందుకు యత్నించడంతో అదుపులోకి తీసుకుని విచారించి ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా (రాజమహేంద్రవరం జిల్లాకేంద్రం) గోకవరం మండలం ఎస్సీపేట దేవీచౌక్ గ్రామానికి చెందిన గొర్రెల చిన్నబాబుగా గుర్తించారు. చిన్నబాబు గత మే 31వ తేదీన డోర్నకల్‌లో ఓ బైక్, మహబూబాబాద్‌లోని రామచంద్రాపురంలో 4.5 గ్రాముల బంగారు, 8 గ్రాముల వెండి ఆభరణాలు, ఆర్టీసీ కాలనీలో 4 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి పాల్పడగా ఆ వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వాటితోపాటు నర్సంపేట, కోదాడ పట్టణాల్లో కూడా రెండు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీసీఎస్ సీఐ హతీరాం, రూరల్ సీఐ, టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య, ఎస్సై ప్రశాంత్, సివిల్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంధువు దశదిన కర్మకు వెళ్లి తిరిగిరాని లోకాలకు..

- చెరువులో నీటమునిగి వ్యక్తి మృతి

ఎల్కతుర్తి: బంధువు దశదిన కర్మ అనంతరం స్నానం చేయడానికి చెరువులో దిగిన ఓ వ్యక్తి ఈత రాక నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో చోటు చేసుకుంది. ఎస్సై దివ్య కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మర్రి ఓదెలు(49) తన బంధువు ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా ఆయన దశదిన కర్మ నిమిత్తం ఈనెల 3న చెరువు వద్దకు వెళ్లారు. కార్యక్రమం అనంతరం స్నానం చేయడానికి చెరువులోకి దిగిన ఓదెలు.. నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. ఈ విషయం కుటుంబీకులు గమనించలేదు. అనంతరం ఇంటివద్దకు చేరుకుని పలు చోట్ల వెతికినా ఓదెలు ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు (4వ తేదీన) తెల్లవారుజామున చెరువులో ఓదెలు మృతదేహం తేలి ఉండడాన్ని గమనించిన స్థానికులు.. కుటుంబీకులు సమాచారం ఇచారు. దీంతో వారు చెరువు వద్దకు వెళ్లి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై దివ్య సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీశారు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి దారుణ హత్య

- మానుకోటలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లెనిన్ నగర్ కాలనీలో జరిగింది. టౌన్ ఇన్‌చార్జ్ సీఐ పి.సర్వయ్య కథనం ప్రకారం... లెనిన్ నగర్ కాలనీకి చెందిన తూళ్ల ప్రభాకర్ (35) చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూ ఉదయం ఇంటి నుంచి వెళ్లి చిత్తు కాగితాలు ఏరుకోవడం, ఏదైనా పని లభిస్తే చేయడం, రైళ్లలో శుభ్రం చేసి కొంత డబ్బులు సంపాదించుకుని రాత్రి ఇంటికి చేరుకుంటాడు. రోజుమాదిరిగానే ఆదివారం రాత్రి కూడా పని ముగించుకుని ఇంటికొచ్చి బయట కాలనీలోని రహదారిపై నిద్రించాడు. ఈ క్రమంలో దుండగులు ఆ యువకుడిని రాయితో తలపై మోది దారుణంగా హత్య చేశారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటనను చూసిన సంపతి శ్రీను అనే యువకుడు కాలనీ వాసులకు చెప్పాడు. విషయం తెలుసుకున్న పోలీసులు.. జాగిలాలు, క్లూస్ టీంతో ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం మృతుడి మేనమామ వనగళ్ల గుట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య తెలిపారు. కాగా, మృతుడు ప్రభాకర్ తల్లిదండ్రులు, సోదరుడు గతంలో మృతిచెందగా అతడు కాలనీలో ఒంటరిగా ఉంటున్నాడు. అందరితో కలిసిమెలిసి ఉండే ప్రభాకర్ దారుణహత్యకు గురికావడం స్థానికులను కలచివేసింది. కాగా, ఉదయం నుంచి సంపతి శ్రీను కనిపించకపోవడంతో ప్రభాకర్ హత్యకు అతడే కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెంలో పని చేయమని తండ్రి మందలించాడని గడ్డి మందుతాగి కుమారుడు, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బల్వంతాపురం గ్రామంలో తల్లిదండ్రులు గొడవ పడుతున్నారని హోంగార్డు, జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామంలో మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపురం మండలం మర్రిపల్లిగూడెనికి చెందిన యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమిరె నర్సింహులు పెద్ద కుమారుడు రాజ్‌కుమార్ (25) తల్లిదండ్రుల మాట వినకుండా స్నేహితులతో తిరుగుతున్నాడు. పని చేయకుండా ఎందుకు తిరుగుతున్నావని, ఏదైనా పని చేయమని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రాజ్‌కుమార్ ఆదివారం మద్యం తాగి అదే మత్తులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి విషయాన్ని బంధువులకు చెప్పాడు. వెంటనే నర్సింహులు తన బంధువులతో కలిసి రాజ్‌కుమార్‌ను వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

తల్లిదండ్రుల గొడవతో హోంగార్డు..


నాగరాజు(ఫైల్)

దుగ్గొండి : తల్లిదండ్రులు గొడవ పడుతున్నారని కలత చెందిన హోంగార్డు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బల్వంతాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన దానం మల్లేశం, విజయ దంపతులు వ్యవసాయం చేస్తు జీవిస్తున్నారు. ఈ క్రమంలో పంటలు పండక రూ.6 లక్షల వరకు అప్పుల య్యాయి. ఆదివారం సాయంత్రం దంపతులు గొడవ పడ్డారు. హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న కుమారుడు నాగరాజు (34) ఇద్దరికి సమాధానం చెప్పలేక విరక్తి చెంది గడ్డిమందు తాగి నిద్రించాడు. సోమవారం ఉదయం శ్వాసతీసుకోవడం కష్టం కావడంతో తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో తాను పురుగుల మందు తాగానని చెప్పడంతో వరంగల్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, నాగరాజు దుగ్గొండి పోలీస్‌స్టేషన్‌లో పదేళ్లుగా హోంగార్డుగా విధులు నిర్వర్తించాడు. ఇటీవల బదిలీపై గీసుగొండకు వెళ్లాడు.

మద్యానికి బానిసై.. ఉరేసుకుని..


రాజు మృతదేహం

జఫర్‌గఢ్ : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తీగారంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై రామ్‌చరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బరబోయిన రాజు (39) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఉంటున్నాడు. ఎందుకు తాగుతున్నావని తండ్రి వెంకటయ్య మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన రాజు.. వ్యవసాయ బావి వద్ద ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.